నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, బుధవారం 26 జూన్ 2024 | NALGONDA

30వరకు డీఈఈ సెట్‌కు దరఖాస్తులు

రామగిరి, జూన్ 25 : డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ కోర్సులో ప్రవేశానికి నిర్వహించే డీఈఈ సెట్‌కు ఈ నెల 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని నల్లగొండ జిల్లా విద్యాశాఖాధికారి బి.భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను http://deecet.cdse.telangana.gov.inలో సమర్పించాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసిన విద్యార్థులకు జూలై 10న ఆన్‌లైన్‌లో పరీక్ష ఉంటుందని, అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జెన్‌కో ఎస్‌పీఎఫ్ ఆర్ఐగా ప్రతాప్‌నాయుడు

ప్రతాప్‌నాయుడు

నందికొండ, జూన్ 25 : నాగార్జునసాగర్ జెన్‌కో ఎస్‌పీఎఫ్ ఆర్ ఐగా ప్రతాప్ నాయుడు మంగళ వారం బాధ్యతలు చేపట్టారు. హైకోర్టులో ఎస్ ఐగా విధులు నిర్వహిస్తున్న ఆయన పదోన్నతిపై నాగార్జునసాగర్ వచ్చారు. గతంలో ఆర్ఐగా పని చేసిన ఈశ్వరరావు హైదరాబాద్‌లోని ఆర్బీఐకు బదిలీ అయ్యారు.

ఇచ్చేదేదో సకాలంలో ఇవ్వండి

'రైతు భరోసా'పై అభిప్రాయ సేకరణలో రైతులు

ఇప్పటిలాగే ఇవ్వాలని కొందరు.. 10 ఎకరాల వరకే చాలని మరికొందరు..

సాగు చేస్తున్న భూములకే వర్తింపజేయాలి

సరిగ్గా గతేడాది ఇదే రోజు జూన్26న అప్పటి కేసీఆర్ సర్కార్ ఎకరం లోపు రైతుల ఖాతాల్లోకి రైతుబంధు డబ్బులను జమ చేయడం షురూ చేసింది. తొలిరోజు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 3.18లక్షల మంది రైతులకు 1.89లక్షల ఎకరాల విస్తీర్ణానికి గానూ 94.97కోట్ల రూపాయలను రైతులకు పెట్టుబడి సాయంగా అందజేసింది. ఇక పట్టాదారు పాసుపుస్తకం ఉన్న ప్రతి రైతుకూ పెట్టుబడిసాయం పక్షం రోజుల్లోనే అందజేసింది. అంటే సీజన్ ఆరంభంలోనే రైతులకు ఇబ్బంది లేకుండా అప్పటి కేసీఆర్ సాగు మద్దతుపై భరోసా నింపారు.

కానీ గతేడాదికి ఒక్కరోజు ముందు అంటే జూన్25వ తేదీ మంగళ వారం రైతుబంధు పేరు మార్చి తలపెట్టిన రైతుభరోసా విధివిధానాలపై ప్రభుత్వం చర్చకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే సీజన్ ఆరంభమై రైతులు సాగు పనుల్లో నిమగ్నం కాగా ఇప్పుడు అందాల్సిన పెట్టుబడి సాయం ఎలా ఇద్దామంటూ రైతులతో సమాలోచనల పేరుతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. ఇందులో వచ్చిన అభిప్రాయాలను క్రోడీకరించి వచ్చే నెల 15వరకు నిర్ణయం ప్రకటిస్తామని చెబుతున్నది. అంటే చర్లలు కొలిక్కి వచ్చి ప్రభుత్వం విధివిధానాలు ఖరారు చేసే సరికి వానకాలం సీజన్ ముగింపు వస్తుందేమోనన్న అనుమానాలు రైతులు వ్యక్తం చేస్తున్నారు. అందుకే మంగళ వారం నిర్వహించిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో మెజార్టీ రైతులు పెట్టుబడి సాయం కింద ఎంతిచ్చినా, ఎవరికిచ్చినా, పరిమితులు విధించినా సీజన్ ఆరంభంలో సకాలంలో రైతుభరోసా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

– నల్లగొండ ప్రతినిధి, జూన్25(నమస్తే తెలంగాణ)


తిప్పర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వ్యవసాయ అధికారులు, రైతులు

రైతుభరోసాను పటిష్టవంతంగా అమలు చేయడంపై విధివిధానాలు రూపొందించడానికి రైతుల నుంచి సలహాలు, సూచనల పేరుతో మంగళ వారం రైతువేదికల్లో వీడి యా కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉమ్మడి జి ల్లాలో అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక రైతువేదికలో మొత్తం 12 చోట్ల ఈ కాన్ఫరెన్స్ జరుగగా వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు. రైతుల హాజరు నామమాత్రంగానే ఉండగా అధికారులు పూర్తి స్థాయిలో వచ్చారు. ఇందులో ముందుగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ రైతు భరోసా కార్యక్రమం మరింత పకడ్బందీగా, సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం రైతుల నుంచి సలహాలు, సూచనలు తీసుకుంటుందన్నారు. అందరి సూచనలు పరిగణలోకి తీసుకొని సబ్ కమిటీతో చర్చించి జూలై 15 లోగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

అయితే నల్లగొండ జిల్లా నుంచి త్రిపురారం మండలం కామారెడ్డిగూడేనికి చెందిన కన్నెగంటి మారయ్యకు మాత్రమే మాట్లాడే అవకాశం లభించింది. ఎంతిచ్చినా, ఎవరికిచ్చినా సకాలంలో రైతులకు డబ్బులు అందేలా చూడాలని చెప్పా రు. రైతుభరోసా, రుణమాఫీ, ఎరువులు, విత్తనాల వంటి వన్నీ సకాలంలో అందితేనే రైతులకు ఇబ్బంది ఉండదన్నారు. పది ఎకరాల వరకు పరిమితి విధిస్తూనే కౌలు రైతులను కూడా పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. మిగతా చోట్ల రైతులు తమ అభిప్రాయాలను రాతపూర్వకంగా అందజేశారు. మిర్యాలగూడలో పలువురు రైతులు స్పందిస్తూ కేసీఆర్ ఇచ్చిన మాదిరిగానే అందరికీ రైతుభరోసా ఇస్తేనే వ్యవసాయం బాగుంటుందని పేర్కొన్నారు. మరికొందరు 10 ఎకరాల వరకు చాలు అని సూచించారు. ఐటీ పేరుతో రైతుల రైతుభరోసా ఆపొద్దు అని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయేతర, రియల్‌ఎస్టేట్ భూములకు నిలిపివేయాలని, ఐటీ ప్రొఫెషనల్స్, డాక్టర్స్, ప్రభుత్వ ఉద్యోగుల లాంటి వారి భూములకు రైతుభరోసా అవసరం లేదని నకిరేకల్ చందుపట్ల రైతువేదికలో రైతులు సూచించారు. నిజంగా వ్యవసాయం చేస్తున్న అందరికీ సకాలంలో రైతు భరోసా అందించాలని పలువురు అభిప్రాయపడ్డారు. షరతులు లేకుండా రుణమాఫీ వర్తింజేయాలని, వ్యవసాయ అనుబంధ పనులకు ఉపాధి హామీ పనులను అనుసంధానం చేయాలని సూచనలు వచ్చాయి.

రైతులను ఆదుకున్నది కేసీఆరే

రాష్ట్రంలోని రైతులను ఆదుకున్నది కేవలం అప్పటి సీఎం కేసీఆర్ మాత్రమే. రైతుల అకౌంట్‌లో రంధ్రంగా రైతు బంధు నగదు పడేది. వాటితో మేము ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కొనుక్కునేవాళ్లం. రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకొని, మా బాగు గోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆలోచించేది. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వస్తే వెంటనే రైతు భరోసా ఇస్తామని చెప్పి ఇప్పటివరకు వేసింది లేదు. రైతులకు కల్లబొల్లి మాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నది. ఎన్ని కలప్పుడు అందరికీ ఇస్తామని చెప్పి, ఇప్పుడు కొందరికే ఇస్తామని చెప్పడం రైతులను మోసం చేయడమే. ఇప్పటికైనా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి రైతు భరోసాను అందరు రైతులకు అందించాలి.

- ఊర సోమయ్య, రైతు, అభంగాపురం, (మాడ్గులపల్లి)

పెట్టుబడి సాయం కోసం ఎదురుచూపులు

మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతును గోస పెట్టిస్తున్నది. రైతు భరోసాపై కోర్రీలు పెడుతున్నది. గత కేసీఆర్ ప్రభుత్వంలో రైతు రాజ్యం నడిచింది. రైతుబంధు ఎన్ని ఎకరాలున్నా పంట వేసే సమయానికి డబ్బులు బ్యాంకు అకౌంట్‌లో వేసేది. ఇప్పుడు పెట్టుబడి సాయం ఎదురు చూడాల్సి వస్తున్నది. మొన్న యాసంగి పంటకు కూడా రైతు భరోసా పంట వేసే సమయానికి కాకుండా తర్వాత ఇవ్వడంతో అప్పు చేయాల్సి వచ్చింది. రుణమాఫీ విషయంలో కూడా పరిమితులు విధించడం సబబు కాదు. క్వింటాకు 500 రూపాయల బోనస్ ఊసే లేదు. కరెంట్ కష్టాలు మళ్లీ మొదలైనయి. ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు చెప్పే మాయమాటలు నమ్మే పరిస్థితిలేదు. గతంలో మాదిరిగానే రైతుబంధుపై పరిమితులు లేకుండా ఇవ్వాలి లేనిపక్షంలో రైతు ఉద్యమాలతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగడతాం.

- హతీరాంనాయక్, రైతు, నాన్యాతండా, (మిర్యాలగూడ టౌన్)

సకాలంలో రైతుభరోసా ఇవ్వాలి

రైతు భరోసా పథకాన్ని ఐదు ఎకరాల్లోపు ఉన్న రైతులందరికీ అందించాలి. కౌలు రైతులకు కూడా ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. రూ.2లక్షల రుణమాఫీ సకాలంలో చేయాలి. రైతులను గత ప్రభుత్వం మాదిరిగానే ఏ ఇబ్బంది లేకుండా ఆదుకోవాలి.

- కన్నెగంటి మారయ్య, రైతు, కామారెడ్డిగూడెం, మాజీ సింగిల్ విండో చైర్మన్, (త్రిపురారం)

10 ఎకరాల వరకు రైతుబంధు ఇవ్వాలి

రైతులకు జూన్ 1వ తేదీలోపు రైతుబంధు ఇవ్వాలి. 10 ఎకరాల వరకు రైతుబంధు ఇవ్వాలి. రైతు భూములకు కూడా రిజిస్ట్రేషన్ వ్యాల్యుయేషన్ పెంచాలి. ఎకరానికి రూ. 30 వేలు మాత్రమే పంట రుణాలు ఇస్తున్నారు. ఎకరానికి రూ.1 లక్షకు పైగా ఇవ్వాలి. వ్యవసాయ అనుబంధాలు కోళ్ల ఫామ్, డెయిరీ ఫామ్, గొర్రెల పెంపకాలకు నిబంధనలు లేకుండా వ్యవసాయ అధికారుల ద్వారా రుణాలు ఇప్పించాలి. పండించిన పంటకు మద్దతు ధర కనీసం వరికి రూ.2,500 ఇస్తేనే కౌలు రైతులకు లాభం జరుగుతుంది. పిండి బస్తాల ధరను తగ్గించాలి. రైతు బయట పెట్టుబడికి అప్పు తెచ్చుకుంటే 3 నుంచి 4 రూపాయలు. అదే బ్యాంకు ఇస్తే రూ.1 మాత్రమే వడ్డీ. రైతుకు ఎకరాకు రూ.1 నుంచి రూ.2 లక్షల వరకు అప్పు ఇవ్వాలి. వడ్లతో తయా రుచేసే ఇతర అనుబంధాలపై రైతులకు అవగాహన కల్పించాలి.

-నర్సింగ్ సోమేశ్వర్, రైతు, చందుపట్ల, (నకిరేకల్)

- **ఎన్నికల హామీ మేరకు కౌలు రైతులకు ఇవ్వాలి**
- **భేషరతుగా రైతు రుణమాఫీ చేయాలి**
- **రైతు నేస్తం వీడియా కాన్ఫరెన్స్‌లో రైతుల భిన్న వాదనలు**
- **జూలై 15లోగా ప్రభుత్వ నిర్ణయం : మంత్రి తుమ్మల**
- **గతేడాది కేసీఆర్ సర్కారులో ఇదే రోజు రైతుబంధు షురూ..**

ఐటీ కట్టే వారికి రైతు బంధు లేదనడం సరికాదు

ప్రభుత్వం ధాన్యానికి గిట్టు బాటు ధర ఇస్తే కౌలు రైతులకు మేలు జరుగుతుంది. రైతు బంధును ఐటీ కట్టేవారికి ఇవ్వమని ప్రభుత్వం ప్రకటించడం సరి కాదు. సన్న ధాన్యానికి బోనస్ ఇచ్చి, దొడ్డు రకానికి ఇవ్వకపోవడం రైతులను మోసం చేయడమే. పండించిన ప్రతి ధాన్యానికి బోనస్ ప్రకటించాలి.

-జాకటి సామేలు, రైతు, (తిప్పర్తి)

ప్రతి ఎకరాకు రైతు భరోసా ఇవ్వాలి

ప్రస్తుత ప్రభుత్వం రైతు భరోసా పథకంపై ఆంక్ష లు విధించాలనుకోవడం సరి కాదు. 5 ఎకరాలకు మాత్రమే రైతు భరోసా అందజేస్తారని జరుగుతున్న ప్రచారంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో 10 ఎకరాలు సాగు చేసిన రైతులకు సైతం వ్యవసాయంలో మిగిలింది ఏమీ లేదు. గత ప్రభుత్వంలో కేసీఆర్ ఇచ్చిన మాదిరిగానే ప్రభుత్వం ప్రతి ఎకరాకు రైతు భరోసా అందజేయాలి.

-నల్లపు వెంకటేశ్వర్లు, అలింగాపురం, (పాలకవీడు)

2014 నుంచి రుణమాఫీ వర్తింపజేయాలి

2014 నుంచి ఈ ఏడాది వరకు పంట రుణాలు తీసుకున్న రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం 2 లక్షల రూపాయల రుణమాఫీ వర్తించేయాలి. 2018 నుంచి మాత్రమే రుణం తీసుకొని 10 ఎకరాల వరకు సాగు చేసే అన్ని వర్గాల రైతులకు రైతు భరోసా ఇవ్వాలి. సేద్యం కాని భూములకు ఇవ్వకూడదు. భూమి లేని వారిని, కౌలు రైతులను గుర్తించాలి.

-పగడాల మట్టయ్య, రైతు, (పాలకవీడు)

సర్వేల్ గురుకులం.. సమస్యలతో సతమతం

- **రేకుల గదుల్లోనే చదువులు**
- **డోర్లు లేని బాత్‌రూమ్‌లు.. అధ్వానంగా మరుగుదొడ్లు**
- **విరిగిన నల్లాలు, తిరుగని ఫ్యాన్లు**
- **రూ.20 కోట్లతో నూతన భవనాలు నిర్మించిన గత ప్రభుత్వం**
- **ప్రారంభించడంలో అధికారుల నిర్లక్ష్యం**
- **ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు**

సర్వేల్ గురుకుల పాఠశాలలో డోర్లు లేని బాత్రూమ్‌లు

సంస్థాన్ నారాయణపురం, జూన్24 : ఎంతో మందిని ఉన్నత విద్యా వంతులుగా, ఉన్నతాధికారులుగా తీర్చిదిద్దిన దేశంలోనే మొట్ట మొదటి సర్వేల్ గురుకులం నేడు పాలకుల, అధికారుల నిర్లక్ష్యంతో అధ్వానంగా తయారైంది. ఎంతో కష్టపడి చదివి సీటు సాధించి, ఎన్నో ఆశలతో సర్వేల్ గురుకులంలో అడుగుపెట్టిన విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం విడుదల చేసిన రూ.20 కోట్లతో అన్ని హంగులతో నిర్మించిన నూతన భవనాలు ప్రారంభించడానికి ఉన్నతాధికారులు మీన మేషాలు లెక్కిస్తుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాత్రూమ్‌లకు డోర్లు లేవు, నల్లాలు విరిగి పోయాయి. స్నానాలు చేయాలన్నా, వాష్ రూమ్‌కు వెళ్లాలన్నా అవస్థలే. కనీసం తాగడానికి మంచి నీటి వసతి కూడా కరువైంది. 100 మంది విద్యార్థులు పడుకునే హాల్‌లో ఫ్యాన్లు పని చేయడం లేదు. 10 సంవత్సరల క్రితం తెచ్చిన మంచాలే ఉండడంతో అవి విరిగి పోయాయి. ఇక రేకుల రూముల్లో తరగతి గదులు నిర్వహిస్తుండడంతో ఎండవేడికి విద్యార్థులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో పెచ్చులు ఊడిపడడంతో విద్యార్థులకు దెబ్బలు తగులుతున్నాయి. ఈ సమస్యలే కాకుండా కొన్నేండ్లుగా గురుకులంలో సబ్జెక్ట్ టీచర్లు లేకపోవడంతో గెస్ట్ ఫ్యాకల్టీలతోనే కాలం వెళ్లదీస్తున్నారు. తాత్కాలిక టీచర్లు తూతూమంత్రంగా చెబుతున్నారని, వచ్చిన రెండు మూడు నెలలకు మించి ఉండకపోవడంతో పాఠాలు అర్థం కావడం లేదని విద్యార్థులు వాపోతున్నారు.

గతేడాదే కొత్త భవనాలు పూర్తి

సర్వేల్ గురుకులంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని అలుమ్ని అసోసియేషన్ సభ్యులు అప్పటి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దాంతో గురుకులంలో నూతన భవనాల నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసింది. గురుకులంలో అకాడమీ బిల్డింగ్, ఆడిటోరియం, వసతి గృహం, డైనింగ్ హాల్, గెస్ట్ హౌస్, స్టాఫ్ క్వార్టర్స్, కంప్యూటర్ డిజిటల్ క్లాస్ రూమ్స్, లైబ్రరీ, నాన్ టీచింగ్ స్టాఫ్ బిల్డింగ్‌లను కార్పొరేట్ పాఠశాలను తలదన్నేలా అన్ని హంగులతో నిర్మించారు. నూతన భవనాల నిర్మాణం పూర్తయి ఏడాది గడుస్తున్నది. గత విద్యా సంవత్సరమే కొత్త భవనాలు ప్రారంభిస్తారని విద్యార్థులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అధికారులు రేపుమాపు అంటూ ఏడాది గడిపేశారు. ఈ విద్యా సంవత్సరం కచ్చితంగా ప్రారంభిస్తామని చెప్పిన అధికారులు పాఠశాల ప్రారంభమై 20 రోజులు గడుస్తున్నా అందుబాటులోకి తీసుకురాలేదు. నూతన భవనాలను త్వరగా ప్రారంభించి విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను దూరం చేయాలని తల్లిదండ్రులు ఉన్నతాధికారులను వేడుకుంటున్నారు. వసతుల కల్పనతోపాటు పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రారంభానికి నోచని పాఠశాల నూతన భవనం

గురుకులాని పట్టించుకునే వారే లేరు

సర్వేల్ గురుకులంలో పోయిన సంవత్సరం నా కొడుకు సీటు వచ్చింది. అందులో బాగా చదువుకుంటాడని అశపడ్డాం. గతంలో ఉన్న సర్వేల్ పాఠశాలకు ప్రస్తుతం ఉన్న దానికి అసలు పోలికే లేదు. పిల్లలకు ఏదైనా సమస్య వస్తే ఎవరిని అడుగాలో అర్థం కాని పరిస్థితి. ప్రిన్సిపాల్ సార్‌కు ఎన్ని సార్లు ఫోన్ చేసినా ఎత్తడు. ఏదైనా అడిగితే సమాధానం కూడా చెప్పడు. బాత్రూమ్, వాష్‌రూమ్‌లకు డోర్లు లేవు. నల్లాలు లేవు. ఫ్యాన్లు పని చేస్తలేవు. పిల్లలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కొత్త బిల్డింగ్‌లను ప్రారంభించి విద్యార్థుల సమస్యలు తీర్చాలి.

- బొడ్డుపల్లి సత్యనారాయణ, విద్యార్థి తండ్రి, సంస్థాన్ నారాయణపురం

నల్లాలు విరిగిపోయిన వాష్ బేసిన్‌లు

నకిలీ బంగారం పెట్టి బ్యాంకు లోన్

రూ. 53.89 లక్షలు మోసం చేసిన ఇద్దరి అరెస్ట్

విలేకరుల సమావేశంలో నిందితులను చూపిస్తున్న సీఐ చలమందరాజు

నేరేడుచర్ల, జూన్ 25 : నకిలీ బంగారం పెట్టి బ్యాంకును మోసం చేసిన నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్లు హుజూర్‌నగర్ సీఐ చలమందరాజు తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలను ఆయన మంగళవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో చెప్పారు. నేరేడుచర్ల మండలం వైకుంఠాపురం గ్రామానికి చెందిన కేశవరపు రాజేశ్ మిర్యాలగూడలో రాజేశ్ గోల్డ్ వర్క్ షాప్ పెట్టి నష్టపోయాడు. దాంతో చేసిన అప్పులు తీర్చడం కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తెనాలి, నెల్లూరు నుంచి నకిలీ బంగారు కట్టు (గొలుసు) తయారు చేయించాడు. ఎవరికీ అనుమానం రాకుండా నకిలీ బంగారు ఆభరణాలపై హాల్‌మార్క్ కేడీఎం 916 ముద్ర వేయించాడు. గరిడేపల్లి మండలం రాయినిగూడెంలోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో అప్రయిజర్‌గా పని చేస్తున్న నల్లగొండ జిల్లా బొమ్మకల్లు గ్రామానికి చెందిన జిల్లేపల్లి నరేందర్‌తో ఉన్న పాత పరిచయంతో ఆయనను కలిశాడు. 'నేను తీసుకొచ్చే బంగారం నిజమైనది. నువ్వు ధ్రువీకరిస్తే నాకు బ్యాంకు మేనేజర్ లోన్ మంజూరు చేస్తాడు. లోన్ మంజూరైన తర్వాత నీకు కొంత నగదు ఇస్తాను' అని చెప్పడంతో నరేందర్ ఒప్పుకొన్నాడు. వీరిద్దరు కలిసి బ్యాంకును భారీగా మోసం చేయడం ప్రారంభించారు. రాజేశ్ తన పేరు మీద నకిలీ బంగారం పెట్టి లోన్ తీసుకోవడంతో పాటు అతని భార్య వర్షిత, అతడి బంధువులు కొమెరపూడి వెంకటాచారి, కణితి సాయిరాం, యర్రగొర్ల పరశురాం, దోనేటి ముఖేశ్, మోత్కూరి సూర్య చేత విడుతల వారీగా నకిలీ బంగారం పెట్టి సుమారు రూ. 53.89 లక్షలు లోన్ తీసుకున్నారు. మే 10 న రెన్యూవల్ కోసం వెళ్లగా మోసాన్ని బ్యాంక్ అధికారులు గుర్తించారు. బ్యాంక్ మేనేజర్ శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు ప్రధాన నిందితుడు కేశవరపు రాజేశ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిని హుజూర్‌నగర్ న్యాయస్థానం ముందు రిమాండ్ చేసినట్లు సీఐ తెలిపారు.

'డబ్బులు డబుల్' ముఠా అరెస్ట్

పట్టుబడిన నగదును చూపిస్తున్న ఎస్పీ శరత్ చంద్ర పవార్

- **రూ.33లక్షలతో ఉడాయించిన బిహార్ కేటుగాళ్లు**
- **చందనపల్లి ఘటనలో 24 గంటల్లో ఇద్దరు నిందితులను పట్టుకున్న పోలీసులు**
- **రూ.24లక్షల నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం**

నీలగిరి, జూన్ 25 : రంగునీళ్లతో నగదు రెట్టింపు చేస్తామని చెప్పి రూ.33 లక్షలతో ఉడాయించిన బిహార్ రాష్ట్రానికి చెందిన మోసగాళ్లను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.24లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలు వెల్లడించారు. నాలుగు సంవత్సరాల కితం నల్లగొండ మండలం చందనపల్లి గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు శ్రీరామోజు రామాచారి ఇంటి నిర్మాణం కోసం బిహార్ రాష్ట్రానికి చెందిన రామ్ నరేశ్ యాదవ్ తాపీ మేస్త్రీగా పనిచేశాడు. ఇల్లు పూర్తయినా రామ్‌నరేశ్ రామాచారితో సంబంధాలు కొనసాగించాడు. ఈ క్రమంలో సులభంగా నగదు సంపాదించాలనే ఉద్దేశంతో రామాచారికి గ్రామంలో పలుకుబడి, డబ్బులు బాగా ఉన్నట్లు గ్రహించాడు. దాంతో రామ్‌నరేశ్ యాదవ్ తన స్నేహితుడు షేక్ సిరాజ్ వద్ద రంగునీళ్లు ఉన్నాయని, వాటి ద్వారా నగదు రెట్టింపు అవుతుందని నమ్మించాడు. రెండు నెలల కితం రామ్‌నరేశ్, షేక్ సిరాజ్ చందనపల్లికి వచ్చి తమ వద్ద ఉన్న లిక్విడ్‌లో రూ.6,500 ఉంచి వాటిని రూ.13,000గా మార్చి రామాచారికి నమ్మకం కలిగేలా చేశారు. ఆ తర్వాత చిన్న మొత్తంలో కాకుండా పెద్ద మొత్తంలో నగదు రెట్టింపు చేస్తామని రామాచారికి డబ్బులు తయారు చేసుకోవాలని చెప్పి వెళ్లిపోయారు. ఆశపడ్డ రామాచారి భూమి కొనుగోలు పేరుతో తన వద్ద ఉన్న బంగారంతోపాటు స్నేహితుల, బంధువుల వద్ద అప్పుగా రూ. 33 లక్షలు తీసుకొచ్చాడు. ఈ నెల 22న ఉదయం రామాచారి ఇంటికి రామ్ నరేశ్, షేక్ సిరాజ్ చేరుకుని వారి వెంట తెచ్చుకున్న లిక్విడ్‌ని ఒక బకెట్లో పోసి రూ.50 వేల కట్టలను ఆరింటిని(మూడు లక్షలు) ఒకసారి లిక్విడ్‌లో ముంచి బయటకు తీసి, వాటికి వారి వద్ద ఉన్న తెలుపు, బ్రౌన్ కలర్ ప్లాస్టర్లు వేసి ఒక బండిల్‌గా చేశారు. అలా రూ.3 లక్షలు ఒక కట్ట చొప్పున మొత్తం రూ.33 లక్షలను 11 కట్టలుగా వాటిని కూడా మూడు పెద్ద బండిల్స్‌గా కట్టి లిక్విడ్‌లో ముంచారు. ఒక గంట తర్వాత వాటిని స్టవ్‌పై వేడి చేసి ఒక రోజు తర్వాత ఓపెన్ చేస్తే ఆ డబ్బులు రెట్టింపు అవుతాయని చెప్పారు. ఈ తతంగం అంత రామాచారితోపాటు ఆయన బావమరిది అమరేంద్రచారి కూడా పర్యవేక్షణ చేశారు. కానీ ఇంతలో అమరేంద్రచారి ఇంటిలో పని ఉందని, గంట తర్వాత వస్తానని చెప్పి వెళ్లిపోయాడు. రామాచారి కూడా ఇంటికి రోగి రావడంతో ఫ్లైఫ్లోర్ నుంచి కిందికి వచ్చాడు. ఆ సమయంలో అక్కడున్నఇద్దరు అప్పటికే వారి వెంట బ్యాగులో ఒక కట్టకి పైన, ఒకటి కింద ఒకటి ఒరిజినల్ రూ.500 నోట్లు పెట్టి మధ్యలో తెల్లటి కాగితాలను పెట్టి ప్యాక్ చేసి ఉంచిన డబ్బు కట్టలను నిజమైన కట్టల స్థానంలో ఉంచి వాటిని నేరస్తుల బ్యాగులలో పెట్టుకొన్నారు. అనంతరం హైదరాబాద్‌కు వెళ్లి లేబుల్స్ తీసుకొని ఉదయం వస్తామని చెప్పి పరారయ్యారు. తర్వాత వాటిని రామాచారి ఓపెన్ చేయగా అందులో తెల్లపేపర్లు ఉండడంతో మోసపోయినట్లు గ్రహించి వెంటనే నల్లగొండ రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు.

24 గంటల్లోనే కేసును ఛేదించిన నల్లగొండ రూరల్ పోలీసులు

రూ.33 లక్షలతో పరారైన నిందితులను నల్లగొండ రూరల్ ఎస్ఐ శివకుమార్ 24 గంటల్లోపే అదుపులోకి తీసుకొని రూ.24 లక్షలు రికవరీ చేశారు. ఎస్ఐ శివ కుమార్ కానిస్టేబుళ్లు తిరుమలేశ్, జానకి రాములు, హోం గార్డ్ సలీమ్‌తో మూడు టీమ్‌లను ఏర్పాటు చేసి మమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. నల్లగొండ డీఎస్పీ కొలను శివరాం రెడ్డి, సీఐ డానియల్ కుమార్ సహకారంతో ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తూ సలహాలు తీసుకున్నారు. ఈ క్రమంలో నల్లగొండ రైల్వే స్టేషన్‌లో బిహార్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకొన్నారు. వారి నుంచి బ్యాగులను తనిఖీ చేయగా అందులో రూ. రూ.24 లక్షలు దొరికాయి. ఈ కేసులో మూడో వ్యక్తి షేక్ అఫ్తాబ్ రూ.9 లక్షలతో బిహార్‌కు పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. ఈ సమావేశంలో నల్లగొండ డీఎస్పీ కొలను శివ రాంరెడ్డి, నల్లగొండ టూ టౌన్ సీఐ డానియల్ కుమార్, నల్లగొండ రూరల్ ఎస్ఐ శివ కుమార్, కానిస్టేబుల్ తిరుమలేశ్, జానకి రాములు, హోమ్‌గార్డ్ సలీమ్ పాల్గొన్నారు.